'శుక్రవారం సభ' పరిష్కార వేదిక

- ప్రతి మహిళా, గర్భిణి, బాలింత ప్రత్యేక కార్యక్రమానికి హాజరు కావాలి
- కలెక్టర్ పమేలా సత్పతి

కొత్తపల్లి, అక్టోబర్ 18 : మహిళల సమస్యలన్నింటికీ శుక్రవారం సభ ఒక పరిష్కార వేదికగా నిలుస్తున్నదని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొత్తపల్లి మండలం నాగులమల్యాల గ్రామంలోని ప్రైమరీ స్కూల్‌లో శుక్రవారం సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ, మహిళలు తమ సమస్యలు ఏవైనా శుక్రవారం సభలో విన్నవించుకోవచ్చని, సభానంతరం దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. ప్రతి మహిళా, గర్భిణి, బాలింత శుక్రవారం సభకు తప్పక హాజరు కావాలని సూచించారు. సభలో పలు విషయాలు చర్చించుకోవడం ద్వారా మహిళల్లో మానసికోత్తేజం కలుగుతుందన్నారు. హెల్త్ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, ప్రభుత్వ అధికారులు శుక్రవారం సభకు హాజరవుతారని, దీనివల్ల సమస్యకు అప్పటికప్పుడే పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ఆరోగ్య మహిళా కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ దవాఖానలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మహిళలందరికీ సుమారు 50 రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. వీటిని ప్రతి మహిళా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. గర్భిణులకు సీమంతం చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, ఆర్డీవో మహేశ్వర్, తహసీల్దార్ రాజేశ్, ఎంపీడీవో సంజీవ్ రావు, గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ నవీన్ కుమార్, జిల్లా సంక్షేమ అధికారి ఎం సరస్వతి, సీడీపీవో సబిత, వైద్యాధికారి సుజాత, జీపీ కార్యదర్శి కవిత పాల్గొన్నారు.

కొత్తపల్లి: గర్భిణికి సీమంతం చేస్తున్న కలెక్టర్

కళాభారతిని ఆధునీకరిస్తాం

కార్పొరేషన్, అక్టోబర్ 18: కళాభారతిని అద్భుతంగా ఆధునీకరిస్తామని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. అన్ని హంగులతో అత్యుత్తమ వసతులు కల్పిస్తామని వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం నగరంలోని కళాభారతిని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కళాభారతి అనేక ఏళ్లుగా కళలకు, కళాకారులకు సేవలందిస్తూ వస్తున్నదని పేర్కొన్నారు. రాష్ట్రంలోనే అత్యుత్తమ కళాభారతిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. కళాభారతిలో సీటింగ్, విద్యుత్తు గ్రీన్ రూమ్, లైటింగ్ వ్యవస్థతో పాటు టెక్నికల్ అంశాల కల్పనకు ప్రత్యేక నిపుణులతో చర్చించి ఆధునీకరిస్తామని వెల్లడించారు. అవసరమైన ప్రతిపాదనలు వెంటనే పంపించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, అక్టోబర్ 18: నగరంలోని పలు ఫీడర్లలో మరమ్మతులు, మెయింటనెన్స్ పనులు చేపడుతున్నందున శనివారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్-1, 2, కరీంనగర్ రూరల్ ఏడీఈలు పంజాల శ్రీనివాస్ గౌడ్, లావణ్య, జీ రఘు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు.

- ఉదయం 9.30నుంచి 11.30గంటల వరకు సంతోష్ నగర్, భాగ్యనగర్, శక్తి టెంపుల్ ఏరియా, విద్యానగర్, ఆదిత్య నగర్, బాలాజీ సూపర్ మార్కెట్ ఏరియా, జ్యోతినగర్, విజయ దుర్గ కాలనీ, న్యూ లేబర్ అడ్డ, పద్మనగర్, రాంనగర్, మంకమ్మతోట, సంతోష్ నగర్, వినాయక నగర్, కుర్మవాడ, శ్రీహరి నగర్, పీటీసీ, మార్కండేయ నగర్, ప్రగతి నగర్, రాజీవ్ పార్కు, ఓల్డ్ లేబర్ అడ్డా, ఆదిత్య అపార్ట్ మెంట్, సిద్ధార్థ స్కూల్, వాసర హాస్పిటల్, పారమిత స్కూల్, సాయిబాబా టెంపుల్, లారెల్ స్కూల్, చింతకుంట ఏరియా, భగత్‌నగర్, ముకరంపుర, గీతాభవన్, మున్సిపల్ ఏరియా, జడ్పీ ఆఫీస్ ప్రాంతాలు
- ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు ఇందిరానగర్, రామాలయం ఏరియా, జ్యోతినగర్, శివ థియేటర్ ఏరియా, క్రిస్టియన్ కాలనీ, కోర్టు ఏరియా, బ్యాంక్ కాలనీ, తేజ స్కూల్, రెడ్డి ఫంక్షన్ హాల్ ఏరియా, వివేకానంద కాలేజీ
- ఉదయం 10నుంచి 11గంటల వరకు 11కేవీ తెలంగాణ చౌక్ ఫీడర్, ఉదయం 11నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మంకమ్మతోట ఫీడర్, రామచంద్రపూర్ కాలనీ
- ఉదయం 9.30నుంచి 11.30గంటల వరకు 33/11కేవీ రేకుర్తి, శాతవాహన యూనివర్సిటీ సబ్ స్టేషన్ల పరిధిలోని ప్రాంతాలు మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 5గంటల వరకు 33/11కేవీ కొత్తపల్లి, చెర్ల బూత్కూర్, బొమ్మకల్, నగునూరు, ముగ్ధంపూర్ సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పెండింగ్ డీఏలు, పీఆర్సీ తక్షణమే ప్రకటించాలి

కలెక్టరేట్, అక్టోబర్ 18 : ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలతో పాటు, 30శాతం ఫిట్‌మెంట్‌తో కూడిన పీఆర్సీని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ప్రకటించాలని తెలంగాణ ప్రభుత్వోద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి ఎండీ రాజ్‌మహ్మద్ డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని మంకమ్మతోటలో గల ఆ సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లతోనే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని గుర్తుంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన పలువురు ప్రభుత్వ ఉద్యోగులకు సభ్యత్వం అందజేశారు. సంఘ ప్రతినిధులు విజయ్‌కుమార్, చింతల శ్రీనివాస్, తంగళ్లపల్లి రామ్మోహన్, వి.నరేందర్‌కుమార్, ఎగ్గిడి మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

నవోదయలో దరఖాస్తుల ఆహ్వానం

చొప్పదండి, అక్టోబర్ 18 : చొప్పదండి జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11వ తరగతుల్లో పరిమిత ఖాళీలకు ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ మంగతాయారు ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన విద్యార్థులు 2025-2026 విద్యా సంవత్సరం కోసం వెబ్‌సైట్ ద్వారా ఉచితంగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 8, 10వ తరగతిలో చదువుతున్న విద్యార్థులు అర్హులని సూచించారు.

దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

తెలంగాణచౌక్, అక్టోబర్ 18: కశ్మీర్‌గడ్డలోని ఐబీఏ గార్డెన్ అక్రమ నిర్మాణమని అక్టోబర్ 15న ఆంగ్ల పత్రిక 'తెలంగాణ టుడే'లో వార్త వచ్చినట్లు నకిలీ క్లిప్పింగ్‌ను సృష్టించి దానిని సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని గార్డెన్ నిర్వాహకుడు ఇర్ఫాన్ బిన్ అలీ అధికారులను కోరారు. ప్రెస్ భవనంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దురుద్దేశపూర్వకంగా గార్డెన్‌పై అసత్య ప్రచారం చేస్తున్నారని వాపోయారు. వినియోగదారులు గార్డెన్ బుకింగ్ చేసుకోకుండా అడ్డుకుంటున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. 'తెలంగాణటుడే'లో ఐబీఏ గార్డెన్‌పై ఎలాంటి వార్త రాలేదని తెలిపారు.

ప్రభుత్వ దవాఖానలకు పోలీసుల భద్రత

విద్యానగర్, అక్టోబర్ 18: ప్రభుత్వ దవాఖానల్లో వైద్యులు, సిబ్బందిపై దాడులను అరికట్టడానికి వైద్య ఆరోగ్యశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా కరీంనగర్ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు అనుసంధానించనున్నట్లు తెలుస్తున్నది. 24 గంటలు పర్యవేక్షణ చేయడంతో పాటు ప్రధాన గేట్ల వద్ద స్క్రీనింగ్, చెకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తారు. ప్రైవేట్ హాస్పిటల్స్ మాదిరిగానే రోగుల బంధువులకు విజిటర్స్ పాస్ అందించడంతో పాటు వైద్యుల రక్షణకు కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. ప్రభుత్వం ప్రత్యేక పోలీసు భద్రత ఏర్పాటు చేయడం పట్ల వైద్యులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్లపై చెత్త వేస్తే కఠిన చర్యలు

కార్పొరేషన్, అక్టోబర్ 18: నగరంలోని పూల వ్యాపారులు పూల చెత్తను మున్సిపల్ వాహనాలకు మాత్రమే అందించాలని, రోడ్లపై పడవేస్తే కఠిన చర్యలు తప్పవని నగరపాలక అధికారులు హెచ్చరించారు. శుక్రవారం నగరంలోని పలు పూల దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు పూల వ్యాపారులు చెత్తను రోడ్లపై పారేయడాన్ని గుర్తించిన అధికారులు, వారికి రూ.12 వేల వరకు జరిమానా విధించారు. రోడ్లపై పూల చెత్త కనిపిస్తే సంబంధిత వ్యాపారులకు భారీ జరిమానాలు విధిస్తామని పేర్కొన్నారు. చెత్తను తరలించేందుకు ప్రతి నెలా యూజర్ చార్జీలు చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో పర్యావరణ ఇంజినీర్ స్వామి, శానిటేషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మృత శిశువు ఘటనతో సంబంధం లేదు

హుజూరాబాద్ టౌన్, అక్టోబర్ 18 : బాత్రూంలో మృత శిశువు దొరికిన ఘటనకు హుజూరాబాద్ ఏరియా దవాఖానకు ఎలాంటి సంబంధమూ లేదని సూపరింటెండెంట్ రాజేందర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. గురువారం రాత్రి 9:30 గంటల ప్రాంతంలో ఆరు నుంచి ఏడు నెలల గర్భిణికి గర్భవిచ్ఛిత్తి అయి ఆడశిశువు పిండాన్ని దవాఖానలోని ఎమర్జెన్సీ వార్డు బాత్రూంలో పడేసి ఉన్నట్టు గుర్తించామని తెలిపారు. ఈ విషయంపై డీసీహెచ్‌ఎస్ డాక్టర్ చంద్రశేఖర్ దవాఖానను సందర్శించి, సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బంది, ఎంఎన్‌వో, ఎక్స్‌రే, టెక్నీషియన్, స్టాఫ్ నర్సులు, డ్యూటీ వైద్యులను విచారించినట్టు తెలిపారు. అనంతరం సీసీ పుటేజీని పోలీసులకు అందించినట్టు చెప్పారు. లోతుగా విచారణ జరిపి, బాధ్యులను కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరారు.

ఆలయ భూముల పరిశీలన

తిమ్మాపూర్, అక్టోబర్ 18: రామకృష్ణకాలనీలోని సుభాష్‌నగర్ స్టేజీ వద్ద ఉన్న శ్రీ అనంత పద్మనాభ స్వామి ఆలయ భూములను దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ సుప్రియ అధికారులు, స్థానిక నాయకులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. త్వరలోనే ఆలయ భూములకు పక్కా హద్దులు నిర్ణయిస్తామని చెప్పారు. కొన్నేండ్లుగా ఆలయ భూమిపై కోర్టులో కేసు ఉండగా, ప్రస్తుతం చిక్కులేమీ లేవని, కచ్చితమైన హద్దులు నిర్ణయిస్తామని తెలిపారు. ఇదిలా ఉండగా ఆలయ భూములను ఆనుకుని ఉన్న తమ రెండు గుంటలకైనా హద్దులు నిర్ణయించాలని వాటి యజమానులు కోరారు.

రైతుల సంక్షేమమే సర్కారు ధ్యేయం

- ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి
- గంగిపల్లిలో 150 మెట్రిక్ టన్నుల గోదాం ప్రారంభం

మానకొండూర్ రూరల్: గంగిపల్లిలో నూతన గోదాంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మానకొండూర్ రూరల్, అక్టోబర్ 18: కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నదని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గంగిపల్లి గ్రామంలో మానకొండూర్ విశాల సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన 150 మెట్రిక్ టన్నుల గోదాంను సంఘం అధ్యక్షుడు నల్ల గోవింద రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, దళారీ వ్యవస్థకు స్వస్తి పలికేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను చేసినట్లు చెప్పారు. రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేశామని, ఇంకా కాని వారికి కూడా త్వరలోనే చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వరి, సొసైటీ ఉపాధ్యక్షుడు పంజాల శ్రీనివాస్ గౌడ్, పాలక వర్గ సభ్యులు, ఏఎంసీ ఉపాధ్యక్షుడు రామిడి తిరుమల్ రెడ్డి, డైరెక్టర్లు, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

మహిళా ప్రాంగణం పరిశీలన

తిమ్మాపూర్, అక్టోబర్ 18: ఎల్ఎండీ కాలనీలో గల దుర్గాబాయి మహిళా ప్రాంగణాన్ని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సందర్శించారు. భవనాలకు మరమ్మతులు చేయించి, వసతులు మెరుగుపరుస్తానన్నారు. ఆయన వెంట ఈఈ అనితా సింగ్నాథ్, సిబ్బంది సుధ, రాజాకిషన్‌రెడ్డి, రేణుక, తిరుమల తదితరులున్నారు.

ఎంబీపీ విద్యార్థినికి చేయూత

బాలయ్యపల్లిలోని సాయబ్‌పల్లికి చెందిన కామెర సమత ఫీజు కట్టలేక చదువు మానేసిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చేయూతనందించారు. ఆమెను క్యాంపు కార్యాలయానికి పిలిపించుకుని మొదటిసంవత్సరానికి సంబంధించిన ఫీజు మొత్తానికి చెక్కు అందజేశారు.

బీఆర్ఎస్ నాయకుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

మల్లారెడ్డిపల్లిలో దేవరాజ్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రేణుక-తిరుపతిరెడ్డి

వీణవంక, అక్టోబర్ 18: మండలంలోని మల్లారెడ్డిపల్లి బీఆర్ఎస్ పార్టీ మాజీ గ్రామాధ్యక్షుడు కర్రె దేవరాజ్ మృతిచెందగా, భౌతికకాయాన్ని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి కారణాలను తెలుసుకొని వారికి భరోసా కల్పించారు. ఇక్కడ మాజీ ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి, నాయకులు రవీందర్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, వెంకటేశ్ తదితరులున్నారు. అలాగే కర్రె దేవరాజ్ మృతదేహం వద్ద మాజీ సర్పంచ్ మేకల ఎల్లారెడ్డి నివాళులర్పించి, అంత్యక్రియల్లో పాల్గొన్నారు. బాధిత కుటుంబ సభ్యులకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు.

గ్రూప్స్‌పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

కమాన్‌చౌరస్తా/ కలెక్టరేట్, అక్టోబర్ 18 : జిల్లాలో గ్రూప్ 1, 2, 3 పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్ రెడ్డి సూచించారు. గ్రూప్స్ పరీక్షల నిర్వహణకు చేయాల్సిన ఏర్పాట్లపై శుక్రవారం కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రూప్ 1, 2, 3 పరీక్షల నిర్వహణ కోసం జిల్లాలో చేయాల్సిన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు జారీ చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, అదనపు కలెక్టర్, పోలీస్ నోడల్ అధికారి, ఆర్డీవో అందరూ ఏర్పాట్లలో సమన్వయం చేసుకుంటున్నారని తెలిపారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలి

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 18 : జిల్లాలోని పాఠశాలల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులు డిసెంబర్‌లోగా పూర్తి చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం ఎంఈవోలు, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం కింద పాఠశాలల్లో నిర్మించే కిచెన్ షెడ్డు, కాంపౌండ్ వాల్, మరుగుదొడ్లు పూర్తి చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం కల్పించి, మరుగుదొడ్లను నిర్మించాలన్నారు. ఈ నిర్మాణ పనులను శిక్షణ కలెక్టర్ అజయ్ కుమార్ పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, పంచాయతీ రాజ్ ఈఈ చంద్రశేఖర్, అధికారులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా లక్ష్మారెడ్డి

మానకొండూర్, అక్టోబర్ 18: కరీంనగర్ జిల్లా కో ఆపరేటివ్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా మానకొండూర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన పాకాల లక్ష్మారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. లక్ష్మారెడ్డి మానకొండూర్ కోఆపరేటివ్ సొసైటీలో సీఈవోగా విధులు నిర్వహిస్తున్నారు.

నంబర్ ప్లేట్ టాంపరింగ్‌పై స్పెషల్ డ్రైవ్

రాంనగర్, అక్టోబర్ 18: ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతి ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్స్ కరీముల్ల ఖాన్, పర్స రమేశ్ సిబ్బందితో కలిసి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట నాకా బందీ నిర్వహించారు. రియలైజేషన్ ఫైన్స్, నంబర్ ప్లేట్ టాంపరింగ్‌పై వెహికిల్ చెకింగ్ చేశారు. సుమారు 62 వెహికల్స్‌పై ఈ చలాన్స్ ఉన్నట్లు గుర్తించి, ఆన్ లైన్ ద్వారా వాటి యజమానులతో జరిమానా కట్టించారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

జమ్మికుంట(వీణవంక), అక్టోబర్ 18: ప్రస్తుత పోటీ సమాజంలో మహిళలు ఆర్థికంగా ఎదుగుతూ ముందుకు నడవాలని మెప్మా పీడీ స్వరూపారాణి, మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ దేశిని స్వప్న సూచించారు. జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను డీఎంసీ శ్రీవాణి, మేనేజర్ రాజిరెడ్డితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం 'కోటి మహిళలు కోటీశ్వరులు' కార్యక్రమం చేపట్టిందని, అందులో భాగంగా ఇందిరా మహిళా శక్తి కింద శ్రీ లక్ష్మీ సమాఖ్యలోని సంఘ సభ్యులు గ్రూప్‌గా ఏర్పడి క్యాంటీన్‌ను ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. అనంతరం 51 ఇండివిడ్యువల్ యూనిట్లు, 9 గ్రూప్ యూనిట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సాయిని రమ, వీరన్న, దేశిని రాధ-సదానందం, స్వరూప-శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువలో తెగిపడిన విద్యుత్ తీగ: షాక్‌తో పంది మృతి

కరీంనగర్ రూరల్, అక్టోబర్ 18 : బొమ్మకల్‌లో మురుగు కాలువలో విద్యుత్ తీగ తెగి పడగా, దాని నుంచి విద్యుత్ సరఫరా కావడంతో పంది మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం.. గురువారం సాయంత్రం కురిసిన గాలివానకు స్థానిక చల్మెడ ఆనందరావు హాస్పిటల్ ఎదురుగా ఉన్న ఎల్‌టీ విద్యుత్ తీగ మురుగు కాలువలో తెగి పడింది. శుక్రవారం ఉదయం మురుగు కాలువలోకి వెళ్లిన పంది తెగిపడిన విద్యుత్ తీగ తగలడంతో విద్యుత్ ప్రసారమై అక్కడికక్కడే మృతి చెందింది. దాని విలువ సుమారు రూ.15వేల వరకు ఉంటుందని యజమాని, దుర్గేడ్ సింగిల్ విండో డైరెక్టర్ బిజిలి పోశాలు తెలిపారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే పంది చనిపోయిందని, విద్యుత్ సంస్థ తనకు పరిహారం చెల్లించాలని కోరారు. కాగా, సమాచారం అందుకున్న విద్యుత్ అధికారులు, సిబ్బంది వెంటనే ఘటనా స్థలం వద్దకు చేరుకున్నారు. సరఫరా నిలిపివేసి తెగిన తీగను ఏసీ విద్యుత్ పోల్‌కు బిగించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వివాహిత మృతి

రామడుగు, అక్టోబర్ 18: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వివాహిత చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన గోపాల్‌రావుపేటలో జరిగింది. రామడుగు మండలం గోపాల్‌రావుపేటకు చెందిన జాతీయ యువజన అవార్డు గ్రహీత అలువాల విష్ణు భార్య రమ్యకృష్ణతో కలిసి ఈ నెల 13న రాత్రి 8 గంటల సమయంలో గోపాల్‌రావుపేట నుంచి పెగడపల్లికి ద్విచక్ర వాహనంపై బయలుదేరి వెళ్లారు. పెగడపల్లి మండలం మ్యాకవెంకయ్యపల్లి శివారులోని వంతెన వద్దకు చేరుకోగానే ఎదురుగా హెడ్‌లైట్ లేని ద్విచక్ర వాహనంపై అత్యంత ప్రమాదకరంగా వచ్చిన వ్యక్తి, విష్ణు దంపతుల వాహనాన్ని బలంగా ఢీకొట్టడంతో కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో విష్ణు ఎడమచెయ్యి, ఎడమకాలు విరిగిపోగా, రమ్యకృష్ణ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చేర్పించి చికిత్స అందించారు. రమ్యకృష్ణ తలకు తగిలిన గాయంతో కోమాలోకి వెళ్లడంతో ప్రభుత్వ దవాఖానలో చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానకు తరలించి వైద్యసేవలు అందించగా, ఆరు రోజులుగా కోమాలో ఉన్న రమ్యకృష్ణ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం తుదిశ్వాస విడిచింది. రమ్యకృష్ణ మృతితో గోపాల్‌రావుపేటలో విషాదఛాయలు అలుముకోగా, గురువారం జగిత్యాల ప్రభుత్వ దవాఖానలో పోస్టుమార్టం తర్వాత మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. శుక్రవారం మధ్యాహ్నం తర్వాత అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో కొండగట్టు దేవస్థానం మాజీ డైరెక్టర్లు దాసరి రాజేందర్‌రెడ్డి, బండపెల్లి యాదగిరి, పుల్కం నర్సన్న, కరీంనగర్ మాజీ గ్రంథాలయ చైర్మన్ పొన్నం సతీశ్‌గౌడ్, జాతీయ యువజన అవార్డు గ్రహీతలు రెండ్ల కళింగ శేఖర్, తోట కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రమ్యకృష్ణ (ఫైల్)

క్రీడలు స్నేహ సంబంధాలను పెంపొందిస్తాయి

కొత్తపల్లి, అక్టోబర్ 18 : విద్యార్థుల మధ్య క్రీడలు స్నేహ సంబంధాలను పెంపొందిస్తాయని జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి బి. వేణుగోపాల్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్టేడియంలో శుక్రవారం జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా స్థాయి బాలబాలికల అండర్-14 వాలీబాల్ పోటీలు ఏర్పాటు చేయగా, ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యతోపాటు క్రీడల్లోనూ విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటాలన్నారు. అనంతరం వాలీబాల్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. జిల్లాలోని 16 మండలాల నుంచి 320 మంది బాలబాలికలు పాల్గొన్నారు. బాలుర విభాగంలో గంగాధర జట్టు విజయం సాధించగా, బాలికల విభాగంలో కరీంనగర్ అర్బన్ జట్టు విజేతగా నిలిచింది. కార్యక్రమంలో జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాష్ట్ర సంఘ ఉపాధ్యక్షుడు గిన్నె లక్ష్మణ్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు సొల్లు సారయ్య, ఎండీ యూనిస్ పాషా, పిటాటీఎస్ రాష్ట్ర సంఘ సభ్యులు కే కృష్ణ , రమేశ్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పత్తిని ఆరబెట్టి తీసుకురావాలి

జమ్మికుంట (వీణవంక), అక్టోబర్ 18: రైతులు పత్తిని ఆరబెట్టుకొని విక్రయానికి తీసుకురావాలని సీసీఐ వరంగల్ బ్రాంచ్ జనరల్ మేనేజర్ అర్జున్ డావే సూచించారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డును శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పట్టణంలో నోటిఫై అయిన ఏడు జిన్నింగ్ మిల్లులను పరిశీలించారు. స్వయంగా పత్తి నాణ్యతను పరిశీలించి, తేమశాతం 30 మాత్రమే ఉందని, పత్తి నాణ్యత బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ అధికారులు, సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలపై దృష్టి పెట్టాలి

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 18 : విద్యార్థులు పరిశోధనలపై దృష్టి పెట్టాలని, రానున్న కాలం కృత్రిమ మేధస్సుదే అని జిల్లా సైన్స్ అధికారి చాడ జైపాల్ రెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక సైన్స్ మ్యూజియంలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు రాష్ట్ర శిక్షణ పరిశోధన సంస్థ సూచనల మేరకు సెమినార్ నిర్వహించారు. కృత్రిమ మేధస్సు వ్యవసాయం, విద్య, వైద్య, రవాణా ఇతర రంగాల్లో ఏ విధంగా వినియోగ పడుతుందో విద్యార్థులు వివరించారు. ఈ క్రమంలో రాష్ట్ర స్థాయి సెమినార్‌కు భువన కృతి ఎంపికయినట్ల